# సాక్షి బాపట్ల

శుక్రవారం, 11, అక్టోబర్, 2024






## దుర్గమాయమ్మ...

బెల్లంకొండ: మండల కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మీ దేవీ నిలయంలో గురువారం మహాలక్ష్మీ అమ్మవారు విజయ దుర్గా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



## ధాన్యలక్ష్మీ పాహిమాం

అచ్చంపేట: స్థానిక శ్రీసీతారామస్వామి వారి దేవాలయంలో సీతాదేవి ధాన్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వాసవీ మాత దుర్గాదేవిగా భక్తులను కనువిందు చేశారు.

## కనక దుర్గాయైనమః



చుండూరు(వేమూరు): దుర్గాష్టమి సందర్భంగా వలివేరులో అమ్మవారు కనక దుర్గా దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి అమ్మను కీర్తించారు.

## న్యూస్‌రీల్


### పేద మహిళలకు జీవనోపాధి కల్పించాలి

**కలెక్టర్ జె.వెంకట మురళి**



బాపట్ల: పేద మహిళలకు జీవనోపాధి కల్పించడంతో పాటు లక్షాధికారులను చేయాలని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. పేద మహిళల జీవన భృతి, ఆర్థిక ఎదుగుదలపై అనుబంధ శాఖల అధికారులతో గురువారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. పేద మహిళలను లక్షాధికారులను చేయాలనే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశాన్ని పక్కాగా అమలు చేయాలని, పీఎంఈజీపీ పథకం కింద 135 యూనిట్లు బాపట్ల జిల్లాలో స్థాపించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం 66 యూనిట్లు మంజూరు కాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని, సత్వరమే లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. పీఎంఎఫ్ఎంఈ పథకం కింద 4,500 యూనిట్లు స్థాపించడానికి కేంద్రం అనుమతులు ఇచ్చిందని, రూ.ఒక లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు రుణం పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందని వివరించారు. మహిళలను లక్షాధికారులను చేసే కార్యక్రమాల్లో బ్యాంకర్లు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ పద్మజ, డ్వామా పీడీ విజయలక్ష్మి, ఎల్‌డీఎం శివకృష్ణ, ఉద్యానవన శాఖ ఏడీ జె జెన్నెమ్మ పాల్గొన్నారు.

### సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 589.00 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 10,350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

# వీడని పచ్చ భయం

- సిండికేట్ దెబ్బకు తగ్గిన మద్యం దరఖాస్తులు
- జిల్లాలో 117 దుకాణాలకు 1250 రాక!
- నగం దుకాణాలకు మొక్కుబడిగా అప్లికేషన్లు
- జిల్లాలో ఆగని పచ్చనేతల దౌర్జన్యాలు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: మద్యం వ్యాపారుల్లో అధికార పచ్చపార్టీ భయం వీడలేదు. తమకు తెలియకుండా మద్యం షాపులకు దరఖాస్తులు వేయకూడదన్న పచ్చనేతల బెదిరింపులతో జిల్లాలో మద్యం షాపులకు పెద్దగా దరఖాస్తులు పడలేదు. అధికారపార్టీ నేతలను ఎదిరించి దరఖాస్తులు వేసినా ఆ తర్వాత ఇబ్బందులు తప్పవన్న భయంతో వ్యాపారులు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. దీంతో ఈసారి మద్యం దుకాణాలకు దరఖాస్తులు బాగా తగ్గాయి. ప్రధానంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ సొంత నియోజకవర్గం రేపల్లెతో పాటు వేమూరు, చీరాల, బాపట్ల నియోజకవర్గాల్లో మద్యం షాపుల దరఖాస్తులు మరింతగా తగ్గినట్లు తెలుస్తోంది. మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు చెందిన అద్దంకి నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో తక్కువ దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా జిల్లాలో పలు నియోజకవర్గాల్లో పచ్చనేతల భయంతో వ్యాపారులు దరఖాస్తులు వేయడానికి సాహసించలేదు.

**117 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్**

జిల్లాలో 117 మద్యం దుకాణాలకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వగా అక్టోబర్ 1వతేదీ నుంచి 9వ తేదీ వరకు మద్యం దుకాణాల కోసం కేవలం 1250 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఒక్కొక్క దుకాణానికి సగటున 10 దరఖాస్తులు పడినట్లు కనిపిస్తున్నా... చాలా దుకాణాలకు 4 నుంచి 5 దరఖాస్తులు మాత్రమే రావడం గమనార్హం.

- వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలంలో 5 దుకాణాలకు 29 దరఖాస్తులు (సగటున 5) వచ్చాయి. చుండూరు, కొల్లూరు మండలాల్లలో 7 మద్యం దుకాణాలు ఉండగా సగటున కేవలం 4 దరఖాస్తులు వచ్చాయి. ఈ నియోజకవర్గంలో మొత్తం 17 మద్యం షాపులు ఉండగా సగటున ఒక్కొక్క దుకాణానికి 6 దరఖాస్తులు వచ్చాయి.
- రేపల్లె రూరల్‌లో 4 మద్యం దుకాణాలకు గాను 16 దరఖాస్తులు (సగటున 4) రాగా నగరం మండలంలో 3 దుకాణాలకు సగటున 6 దరఖాస్తులు వచ్చాయి. నిజాంపట్నం, రేపల్లె పట్టణాల్లో సగటున 9 దరఖాస్తులు వచ్చాయి. నియోజకవర్గంలో మొత్తం 19 దుకాణాలు ఉండగా 156 దరఖాస్తులు (సగటున 8) వచ్చాయి.
- చీరాల పట్టణంలో 8 దుకాణాలకు గాను 51 దరఖాస్తులు (సగటున 6) వచ్చాయి. చీరాల రూరల్ పరిధిలో సగటున పది దరఖాస్తులు రాగా నియోజకవర్గంలో మొత్తం 19 దుకాణాలకు గాను 194 దరఖాస్తులు ( సగటున 10) పడ్డాయి.
- అద్దంకి నియోజకవర్గంలోని సంతమాగులూరులో 5 మద్యం దుకాణాలకు గాను సగటున నాలుగు దరఖాస్తులు రాగా బల్లికురవ మండలంలో సగటున 9, అద్దంకిలో 10 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. నియోజక వర్గంలో మొత్తం 23 దుకాణాలకు గాను 235 దరఖాస్తులు (సగటున 10) వచ్చాయి.
- బాపట్ల నియోజకవర్గంలో బాపట్ల మున్సిపాలిటీలో 7 దుకాణాలకు గాను 66 దరఖాస్తులు (సగటున 9), కర్లపాలెం మండలంలో 4 దుకాణాలకు గాను 36 దరఖాస్తులు (సగటున 9) రాగా మిగిలిన బాపట్ల, పిట్టలవాని పాలెంతో కలిపి నియోజకవర్గం మొత్తం 19 దుకాణాలకు గాను 191 దరఖాస్తులు (సగటున10) వచ్చాయి.
- పర్చూరు నియోజకవర్గంలోయద్దనపూడి మండలంలో 2 దుకాణాలకు 13 దరఖాస్తులు (సగటున 6) మాత్రమే రాగా ఇంకొల్లు మండలంలో జిల్లాలోనే అత్యధికంగా మూడు దుకాణాలకు 121 దరఖాస్తులు (సగటున 40) వచ్చాయి. కారంచేడులో సగటున 20, మార్టూరులో 24 చొప్పున రాగా పర్చూరులో 15 దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా నియోజకవర్గంలో 20 దుకాణాలకు 408 దరఖాస్తులు (సగటున 20) వచ్చాయి.

- గతంలో ఒక్కో మద్యం దుకాణానికి 20 నుంచి 30 దరఖాస్తులు రాగా ప్రస్తుతం పర్చూరు మినహా అన్ని నియోజకవర్గాల్లో మద్యం దుకాణాలకు దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. ఏకపక్షంగా మద్యం దుకాణాలను కైవశం చేసుకోవాలన్న దురుద్దేశంతో పచ్చపార్టీ నేతలు బెదిరింపులకు దిగడంతో చాలామంది ఆసక్తి ఉన్నా దరఖాస్తులు వేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో జిల్లాలో మిగిలిన జిల్లాతో పోలిస్తే అతి తక్కువగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు పడ్డాయి. ఇంకా రెండు రోజులు గడువు ఉన్న నేపథ్యంలో ఎన్ని దరఖాస్తులు వస్తాయో వేచి చూడాల్సి ఉంది.



## దుర్గతులు బాపి...

అమరావతి: పవిత్ర పుణ్యక్షేత్రమైన అమరావతి క్షేత్రంలో శ్రీదేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలలో భాగంగా శ్రీ బాల చాముండికా సమేత అమరేశ్వరాలయంలో గురువారం బాలచాముండేశ్వరి అమ్మవారిని దుర్గతులను రూపుమాపే దుర్గాదేవిగా అలంకరించారు. దుర్గాష్టమి సందర్భంగా దుర్గాదేవిగా బాల చాముండేశ్వరి అమ్మవారు భక్తులచే పూజలందుకున్నారు. సహస్ర కుంకుమార్చన, దేవీఖడ్గమాల, త్రిశల, లలితా సహస్రనామార్చన, శ్రీచక్రార్చన వంటి పూజకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి దేవాలయం, కోదండరామాలయాల్లో దుర్గాదేవిగా అమ్మవార్లు దర్శనమిచ్చారు.

## క్లుప్తంగా

### శ్రీ లక్ష్మీదేవికి వెండి మకర తోరణం బహూకరణ



మంగళగిరి: పట్టణంలోని నాంచారమ్మ చెరువులో కల శ్రీ భద్రావతి సమేత భావనా ఋషి ఆలయంలోని ఉపాలయంలో ఉన్న శ్రీ లక్ష్మీదేవికి దాతలు వెండి మకరతోరణం చేయించారు. గురువారం దాతలు గోలి లోకేశ్వరి, గోలి సౌజన్య, అందె ఝాన్సీరాణి, పవన్ కుమార్‌లు రూ.4 లక్షల విలువైన తోరణాన్ని బహూకరించారు. పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం పెద్దల చేతుల మీదుగా అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు దామర్ల కుబేరస్వామి, చింతక్రింది కనకయ్య, రామనాథం పూర్ణచంద్రరావు, బిట్రా భాస్కరరావు, వంగర పెదల క్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ నేతల రాజీనామా ఆమోదం

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, మీడియా ప్యానలిస్ట్ పాలిబండ్ల రామకృష్ణ రాజీనామాలను ఆమోదించినట్లు బీజేపీ రాష్ట్ర శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇరువురు నేతలు మహిళలతో అసభ్యకరంగా మాట్లాడినట్లు సోషల్ మీడియాలో కథనాలు రావడంతో, వాటి ఆధారంగా పార్టీ ఆదేశాల మేరకు వారు రాజీనామా చేశారు. సోషల్ మీడియాలో ప్రస్తావనకు వచ్చిన సుకన్యను కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు రాష్ట్ర అధిష్టానం తెలిపింది.

# నేడూ 'మద్యం' దరఖాస్తుకు అవకాశం

**ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ సాయి నాగరాజు**

రేపల్లె రూరల్: మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 11వతేదీ వరకు అవకాశం కల్పించిందని ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ సాయి నాగరాజు తెలిపారు. రేపల్లె, నగరంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాలను గురువారం సాయంత్రం ఆయన సందర్శించి దరఖాస్తు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. నేటి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు స్వీకరణ ప్రకియ కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకు అనుకున్న స్థాయిలో దరఖాస్తులు అందాయన్నారు. రేపల్లె, నగరం సీఐలు దివాకర్, శ్రీరామ్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కొత్త మద్యం పాలసీలో భాగంగా నియోజకవర్గంలోని 23 మద్యం షాపులకు గురువారానికి 175 దరఖాస్తులు వచ్చినట్లు బాపట్ల జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిటెండెంట్ బీ. వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉత్సాహవంతులు శుక్రవారం సాయంత్రం వరకు దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. అద్దంకి డివిజన్ సీఐ ఏ భవాని ఉన్నారు.

**14న ఎమ్మెస్సార్ కల్యాణ మండపంలో డ్రా**

బాపట్లటౌన్: జిల్లాలోని 117 షాపులకు గానూ ఇప్పటి వరకు 1346 దరఖాస్తులు వచ్చాయని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి. దేవదత్తు తెలిపారు. జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో గురువారం విలేకరుల తో మాట్లాడారు. జిల్లాలో 7 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయని, 11న సాయంత్రం 7 గంటలలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో చేసుకోవచ్చన్నారు. వాటిల్లో బాపట్ల స్టేషన్ పరిధిలో 19 షాపులు ఉండగా వాటికి గానూ 191 దరఖాస్తులు అందాయన్నారు. రేపల్లె స్టేషన్ పరిధిలో 12 గానూ 81 దరఖాస్తులు, వేమూరులో 12 గానూ 92 దరఖాస్తులు, చీరాలలో 24 గానూ 281, పర్చూరులో 15 షాపులకు గానూ 344, అద్దంకిలో 23 గానూ 248, నగరంలో 12 గానూ 109 చొప్పున 1346 దరఖాస్తులు అందాయన్నారు. 14న ఉదయం 8 గంటలకు పట్టణంలోని ఎమ్మెస్సార్ కల్యాణ మండపంలో లాటరీ పద్ధతిలో డ్రా తీయటం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులంతా ఈనెల 14న ఉదయం 7 గంటలకే కల్యాణ మండపానికి చేరుకోవాలన్నారు. జిల్లాలోని 117 షాపులకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ పి.గీతిక పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న డీసీ హేమంత్ సాయి నాగరాజు



మాట్లాడుతున్న జి. దేవదత్తు

## నిర్వాహకులకు అధికంగా కమీషన్

**ఒంగోలు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు**

వేమూరు: మద్యం షాపుల నిర్వాహకులకు ప్రభుత్వం అధిక కమీషన్ ఇస్తోందని ఒంగోలు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు వెల్లడించారు. వేమూరు మండల కేంద్రంలో నూతన మద్యం విధానం ద్వారా టెంటర్లు వేసే ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. మద్యం టెండరుదారులతో ఆయన గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. మద్యం టెండర్లు శుక్రవారం ముగింపు కనుక మద్యం పాటదార్లు త్వరగా టెండర్లు వేయాలని ఆయన పేర్కొన్నారు. ఎక్సైజ్ కార్యాలయంలో టెండరుదారులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం షాపుల నిర్వాహకులు ప్రభుత్వం 20 శాతం కమీషన్ ఇస్తోందని, అందువల్ల మద్యం షాపుల వల్ల అధిక లాభాలు వస్తాయన్నారు. మద్యం షాపులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేయడంజరుగుతుందన్నారు. వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు, వేమూరు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో 12 షాపులు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు వేమూరు ఎక్సైజ్ పరిధిలో 110 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు. అలాగే ఈనెల 14వ తేదీన టెండర్లు డ్రా తీయడం జరుగుతుందన్నారు. 16వ తేదీ నుంచి కొత్త పాటదారులు మద్యం షాపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రవి కుమార్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



## దివ్యాంగులకు అండగా వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి

వేమూరు: దివ్యాంగులను అన్నివిధాలా ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామానికి చెందిన బెజ్జం పాలు కుమారుడు విజయకుమార్ 6 నెలల క్రితం ప్రమాదం వల్ల కుడి కాలు కోల్పోయారు. అతడి అవస్థలు గురించి తెలియడంతో శుక్రవారం అమ్మ కంటి వైద్యశాల వ్యవస్థాపకులు డాక్టర్ అమృతపాణితో అశోక్‌బాబు మాట్లాడారు. కృత్రిమ కాలు అమర్చేందుకు చర్యలు తీసుకున్నారు. బాధితుడికి రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. వేమూరు మండలంలోని పెనుమర్రు గ్రామంలో అరుంబాక సుజాత రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయారు. ఆ కుటుంబానికి రూ. 30 వేలు అందజేశారు. పోతుమర్రు గ్రామంలో దివ్యాంగులకు ప్రభుత్వ పింఛన్ రావడం లేదు. ఎన్నికల ప్రచారంలో ప్రతి నెల రూ.మూడు వేలు సహాయం అందజేస్తానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. దీంతో ప్రతి నెల ఆ మొత్తం ఇస్తున్నారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి గ్రామంలో, మోపర్రు గ్రామంలో దివ్యాంగులకు ఆర్థిక సహాయం అందజేశారు. నియోజకవర్గంలో వికలాంగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నందున సాయం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



వేమూరులో ఆర్థిక సహాయం అందించి ధైర్యం చెబుతున్న వరికూటి అశోక్‌బాబు

## దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి భేష్



మేడూరు శ్రీనివాసమూర్తి

వేమూరు: రాష్ట్రంలోని దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని బాపట్ల జిల్లా అర్చక సేవా సంఘం కన్వీనర్ మేడూరు శ్రీనివాస మూర్తి పేర్కొన్నారు. గురువారం ఆయన వేమూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మేనిఫెస్టో మేరకు దేవదాయ శాఖలో అనేక మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. అతి తక్కువ ఆదాయం కలిగిన ఆలయాల్లో పని చేసే అర్చకులకు ధూపదీప నైవేద్యం పథకం ద్వారా వేతనం పెంచినట్లు పేర్కొన్నారు. అర్చకుల విలువలు కాపాడేందుకు స్వయం ప్రతిపత్తి ఎంతగానో దోహదపడతుందని తెలిపారు. అర్చకులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా గాదె మధుసూదన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, బాపట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా బాపట్లకు చెందిన గాదె మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి తనయుడు గాదె మధుసూదన్‌రెడ్డి వైఎస్సార్ సీపీలో కీలక నేతగా ఉన్నారు. గత ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గ అబ్జర్వర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తాజాగా పార్టీ ఆయనకు రాష్ట్ర కార్యదర్శి పదవి కట్టబెట్టింది. తనపై నమ్మకంతో నియమించినందుకు అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడమే లక్ష్యమన్నారు.



# దివ్యరూపిణీ.. పాపహారిణీ

• శ్రీదుర్గాదేవిగా దుర్గమ్మ దర్శనం • ఇంద్రకీలాద్రికి కొనసాగుతున్న భక్తుల రద్దీ • రేపు హంస వాహనంపై ఆది దంపతుల జల విహారం • పూర్ణాహుతితో ముగియనున్న దసరా ఉత్సవాలు



పూజలు అందుకుంటున్న అమ్మవారు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్లు కొలువైన ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. దసరా ఉత్సవాల్లో ఎనిమిదో రోజైన గురువారం అమ్మవారు శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకు నేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. తెల్లవారుజాము నాలుగు గంటలకు అమ్మవారికి విశేష అలంకరణ, పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. బుధవారం మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని అర్ధరాత్రి 1.30 గంటల వరకు అమ్మవారిని సరస్వతీదేవి అలంకారంలో దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. క్యూలైన్‌లో ఉన్న భక్తులందరికీ అమ్మవారి దర్శనం కల్పిస్తామని దేవస్థాన అధికారులు, పోలీసులు ముందుగానే ప్రకటించారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత రద్దీగా కనిపించడంతో మరో గంటన్నర పాటు దర్శనాన్ని పొడిగించారు. వినాయకుడి గుడి వైపు, కుమ్మరిపాలెం వైపు క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి.

**రేపటితో ముగియనున్న ఉత్సవాలు**

శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమైన దసరా ఉత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. ఆ రోజు అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 11 గంటలకు మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. సాయంత్రం పవిత్ర కృష్ణా నదిలో ఆది దంపతులకు హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

**టైం స్లాట్ మరో మారు విఫలం**

వీఐపీ దర్శన టికెట్ల గందరగోళం గురువారం మళ్లీ కనిపించింది. రూ.500 దర్శన టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో వేచి వుండగా, ప్రజాప్రతినిధులు ఇచ్చే వీఐపీ టికెట్లతో పలువురు ప్రత్యేక క్యూ మార్గంలో అమ్మవారిని దర్శించుకున్నారు. టైం స్లాట్ విధానం మరో మారు విఫలమైంది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వీఐపీ దర్శనాలకు కూటమి పార్టీల కార్యకర్తలు వస్తూనే ఉన్నారు.

**వేద విద్వత్ సభ**

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం దుర్గమ్మ సన్నిధిలో వేద విద్వత్ సభ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకులను సత్కరించి పురస్కారాలను అందజేశారు. మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ విచ్చేశారు. వంద మంది ఘనాపాఠీలకు రూ.6 వేల చొప్పున, 300 మంది క్రమ పాఠీలకు రూ.5 వేలు, 175 మంది అర్చకులకు రూ.4,500 చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.ఎస్.రామ రావు, డెప్యూటీ ఈఓ రత్నరాజు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, షణ్ముఖ శర్మ పాల్గొన్నారు. దసరా ఉత్సవాల్లో గురువారం దేవస్థానానికి రూ.64.70 లక్షల మేర ఆదాయం సమకూరింది. రూ.500 టికెట్ల విక్రయంతో రూ.20.91 లక్షలు, రూ.300 టికెట్లతో రూ.5.31 లక్షలు, రూ.100 టికెట్లతో రూ.3.31 లక్షలు, లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.30.59 లక్షలు, ప్రత్యేక ఆర్జిత సేవలు, విరాళాల ద్వారా రూ.4.58 లక్షల మేర ఆదాయం లభించిందని అధికారులు తెలిపారు.



**వైభవంగా నగరోత్సవం**

శ్రీగంగ, పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవ సేవ వైభవంగా సాగింది. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆది దంపతుల ఉత్సవ మూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలుచేసి ఊరేగింపును ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తజనుల కోలాట నృత్యాల మధ్య నగరోత్సవం నయనానందకరంగా సాగింది. భక్తులు, ఉభయదాతలు పాల్గొని పులకించారు.

**రేపు కృష్ణమ్మ ఒడిలో ఆదిదంపతుల విహారం**

ఇంద్రకీలాద్రిపై కొలువున్న ఆదిదంపతులు శనివారం కృష్ణమ్మ ఒడిలో జలవిహారం చేయనున్నారు. విజయ దశమి పర్వదినాన కృష్ణమ్మ ఒడిలో దుర్గమ్మ జలవిహారం అపూరూప సన్నివేశం. తెప్పోత్సవంగా పిలిచే హంస వాహన సేవ అమ్మవారికి అత్యంత ప్రీతికరమైనది. అమ్మవారి విజయానికి సూచికగా విజయదశమి నిర్వహిస్తాం. దసరా ఉత్సవాల్లో భాగంగా గంగ సమేత శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్లను హంసవాహనం అధిష్టింపజేస్తారు. వేద పండితుల చతుర్వేదస్వస్తి, అర్చకస్వాముల మంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాలు మార్మోగుతుండగా భక్తుల జయజయధ్వానాల మధ్య హంసవాహనం ముమ్మార్లు కృష్ణమ్మ ఒడిలో విహరిస్తుంది. ఆదిదంపతుల జల విహారాన్ని తిలకించేందుకు లక్షలాదిగా భక్తులు తరలివస్తారు.

**దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు**

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా శ్రీదుర్గాదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ దంపతులు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, ఎమ్మెల్యే సుజనా చౌదరి దంపతులు, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ కుటుంబ సమేతంగా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన, సినీ నిర్మాత ఎ.ఎం.రత్నం అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

**దుర్గగుడిపై నేడు**

- తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభం
- తెల్లవారుజామున 5 గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన
- ఉదయం 7, 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- ఉదయం 8 గంటలకు ప్రత్యేక శ్రీచక్ర నవార్చన, ప్రత్యేక చండీహోమం
- సాయంత్రం 5 గంటలకు మహా మండపం ఆరో అంతస్తులో అర్చక సన్మాన సభ
- సాయంత్రం 6.30 గంటల నుంచి అమ్మవారికి మహానివేదన, పంచహారతులు, చతుర్వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

**అమ్మవారి నివేదనలు**

- తెల్లవారుజాము 3 గంటలకు బాలభోగ నివేదన
- ఉదయం 6 గంటలకు చిత్రాన్నం నివేదన
- 10.30 గంటలకు రాజభోగ నివేదన
- మధ్యాహ్నం 12 గంటలకు పంచభోగ నివేదన
- సాయంత్రం 4 గంటలకు విశేష భోగ నివేదన
- సాయంత్రం 6.30 గంటలకు మహా నివేదన



# ఇసుక తవ్వేసి.. మసకేసి..

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- దొంగమార్గంలో ఇతర ప్రాంతాలకు తరలింపు



గింజుపల్లి రీచ్‌లో ఇసుక కుప్పలు

అచ్చంపేట: మండల కేంద్రం నుంచి దొంగమార్గంలో ఇసుక దర్జాగా తరలిపోతోంది. అడిగే వాడు, ప్రశ్నించే వాడు లేడన్న ధైర్యంతో ఇసుకను యథేచ్ఛగా తవ్వేసి అమ్మేసుకుంటున్నారు. ఇందుకు ఉదాహరణ గురువారం పట్టుబడిన లారీలే. అచ్చంపేట, పెదపాలెం, కొండూరు, దొడ్లేరు, బెల్లంకొండ మీదుగా పిడుగురాళ్ల మెయిన్ రోడ్డుకు అక్రమ రవాణా చేస్తున్న నాలుగు ఇసుక లారీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దారు జి.శ్రీనివాస యాదవ్ తన సిబ్బందితో కొండూరు వద్ద కాపుకాసి నాలుగు ట్వెల్వ్ టైర్ లారీలను అదుపులోకి తీసుకుని అచ్చంపేట పోలీసులకు అప్పగించారు.

**అదుపులోకి రాని తవ్వకాలు–రవాణా**

అధికారులు ఎంత కాపుకాసినా, రాత్రిళ్లు కాపాలా ఉంటున్నా ఇసుక అక్రమ తవ్వకాలను, అక్రమ రవాణాను అధికారులు పూర్తిస్థాయిలో నియంత్రించ లేకపోతున్నారు. అక్రమార్కులు యథేచ్ఛగా రీచ్‌లలో తమ ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నారు. నదిలో రాత్రిళ్లు పొక్లయినర్స్‌తో ఇసుకను తవ్వి కుప్పలు చేసుకోవడం, తమను ఎవ్వరూ ఏమీ చేయలేరన్న ధీమాతో ట్వెల్వ్ టైర్ లారీలు, ట్రాక్టరులతో దొంగదారిన ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మండలంలోని గింజుపల్లి ఇసుక రీచ్‌లో అర్ధరాత్రి 2 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్తుల కథనం. తాడువాయి, కొత్తపల్లి, కోగంటివారిపాలెం, కోనూరు, కస్తల, చామర్రు గ్రామాల నుంచి కూడా ట్రాక్టర్లు లారీలలో ఇసుక తరలి వెళుతోంది. అన్ని అనుమతులున్న లారీలు మాదిపాడు వద్దగల స్టాక్ పాయింట్‌లో లోడ్ చేయించుకుని అచ్చంపేట, వేల్పూరు, క్రోసూరు, సత్తెనపల్లి మీదుగా పిడుగురాళ్ల రోడ్డు ఎక్కాల్సి ఉంది. కానీ మాదిపాడు స్టాక్ పాయింట్‌లో ఇసుక అయిపోవడంతో గింజుపల్లి, చింతపల్లి, తాడువాయి, కొత్తపల్లి, చామర్రు, కోగంటి వారి పాలెం, అంబడిపూడి, కోనూరు, కస్తల గ్రామాల్లో అక్రమ తవ్వకాలు చేపట్టారు.

**అదుపులో 9 ఇసుక లారీలు, 10 ట్రక్కులు**

ఇటీవల కాలంలో అంటే గత వారం రోజులలోపు అక్రమంగా రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడి పోలీస్ స్టేషన్‌లో ఉన్న లారీలు 9, ట్రాక్టరు ట్రక్కులు 10 వరకు ఉన్నాయి. మరికొన్ని కోర్టులో పెనాల్టీలు చెల్లించి విడిపించుకుపోయిన వాహనాలు చాలా ఉన్నాయి.